కథ



# అంతా మామ మయం

యన్.కే. రామారావు

సైకియాట్రిస్టు డా. మనస్వి కుర్చీలో గొంతుక్కూర్చుని నన్ను భయం భయంగా బిత్తర చూపులు చూస్తున్నాడు. చీటికి మాటికీ తన పక్కన తలుపుకేసి చూడసాగాడు. బహుశా పారిపోవడానికేమో అనుకున్నా. ''నమస్కారం డాక్టరు గారూ'' అంటూ పరిచయం చేసుకున్నాను.

అతడెందుకు భయపడుతున్నాడో తెలియడం లేదు. కానీ నా మనసులో ఆనందతరంగాలు ఎగసి ఎగసి పడుతున్నాయి. పుట్టి బుద్ధెరిగిందగ్గర్నుంచి నన్ను చూసి భయపడ్డది ఈయనొక్కడే. అంచేత ఆయన మీద నాకు ఆప్యాయత అభిమానం బిపి పెరిగినట్లు పెరిగాయి.

"నాదో విచిత్రమైన కేసు మనస్వి గారూ. నాకు పిచ్చి ఇప్పటికే ఎక్కిందా లేక సమీప భవిష్యత్తులో ఎక్కబోతోందా తెలుసుకోవాలని ఉత్సాహపడుతున్నా"

ఈ మాటలతో డా. మనస్వి మరింత భయంతో కుర్చీలో మరింత ముడుచుకున్నాడు. తలుపు చాటున ఒక స్త్రీ మా సంభాషణ వింటోందన్న నా ఇంగితం నన్ను పదే పదే హెచ్చరిస్తున్నది.

"ముందు మీ పేరు విని మీరు ఆడమనిషి- సారీ స్త్రీ స్వరూపిణి అనుకున్నాను. కాని మీ ముఖం చూశాక-మొహం చూసి మాత్రమేనండోయి- మీరు మగవారేనని నిశ్చయించుకొని చాలా సంతోషిస్తున్నాను"

ఆడ మనిషినైనా బాగుండేదంటూ మూలిగాడు మనస్వి.

"సరే నా విషయం చెబుతాను. నాకు మంచి ఉద్యోగం వుంది. నలభై లోపు వయసుంది. విజ్ఞానం ఫ్లోరోసెంటు కాంతిలా నా మొహం లోనూ మొహం నుంచి కూడాను-నిత్యం సతతధారాపాతంలా ప్రసరిస్తున్నది. ఈ విషయం ఈ సరికే మీరు గ్రహించి వుంటారు. మీకు మాత్రమే చెపుతున్నానండోయ్" లో గొంతుకతో చెప్పాను. "నా బ్యాంకు బ్యాలన్సు కూడా బానే వుంది"

తలుపు చాటున గాజుల చప్పుడు వినిపించింది. మనిషి కనపడడలేదు. "ఎవరో చాటుగా మన మాటలు వింటున్నట్లుంది" అనుమానం వ్యక్తం చేశాను.

"అవును. నిజమే అలా వినడం చాలా అవసరం కూడా" గంభీరంగా అన్నాడు మనస్వి.

"సార్... నా సమస్య చెపుతాను. నాకు జీవితంలో సంతోషం అనేది అందరానిపండు-గగన కుసుమం ఇలాంటివే పోలికలు మరో రెండు మూడు కలుపుకోండి. మరేం ఫర్వాలేదు. అసలు నా బాధేమిటంటే నాకంటే వయసులో రెండింతలు పెద్దవాళ్లు కూడా నన్ను అంకుల్ అని సంబోధిస్తున్నారు. మొన్నటి మొన్న బస్టాపులో ఒకావిడ - వయసు అరవై పై మాటే. నన్ను అంకుల్ అని పిలుస్తూ బస్సు ఎన్ని గంటలకు వస్తుంది అని అడిగింది. నేను జ్యోతిష్కుడిని కాదు. అంకుల్ అంతకంటే కానని నిర్మొహమాటంగా చెప్పాను. అంత కోపమెందుకు అంకుల్ అంది. సిగ్గూ లజ్జా మానాభిమానాలు ఉన్నవాడిని కాబట్టి ఆవిడను అక్కడే చంపేయాలని ఆ తరువాత స్వయంగా చితి పేర్చుకొని ప్రాయోపవేశం చేసుకోవాలనుకున్నాను. కాని కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ పన్లూ రెండూ ప్రస్తుతానికి వాయిదా వేసుకున్నాను.

"చెపుతూ పోండి వింటూనే వుంటాను" అన్నాడు మనస్వి.

"చెపితే మీకు నవ్వులాటగా వుంటుంది. అనుభవిస్తే తెలుస్తుంది సార్ నా బాధ. హోటలు కెళ్లాను సార్. సర్వర్ గాడు ఏం కావాలి గురూ అని చిద్విలాసంగా పెద్ద రాతగాడిలా చెవిలో పెన్సిల్‌తో నిలబడి అడిగాడు. దానిగ్గాను నేను చాలా పెద్ద రాద్ధాంతం చేసాను. చోద్యం చూస్తున్న పక్క టేబిల్ వాడు సర్వర్‌కు హితవు చెప్పాడు. ఎవరిని పడితే వారిని గురూ అనకూడదు. ఎంచక్కా ఏం కావాలంకుల్ అనొచ్చుగా. నాకు మండిపోయింది డాక్టర్‌గారూ. దీన్ని పెనం మీంచి పొయ్యిలో పడడం అనొచ్చునా"

"ఏమో నేను బయటవాళ్లతో ఎక్కువగా మాట్లాడను"

సరే, సార్ ఆ డెబ్బై ఏళ్ల మేనేజరుకు షికాయత్ చేస్తే వాడు మరోసారి ఇలా జరగకుండా చూస్తానంకుల్ అంటూ హామీ ఇచ్చాడు. తిక్కరేగి వాడి ముక్కు మీద- ఒకే ఒక్క గుద్దు గుద్దానుసార్. వాడి కళ్లద్దాలు పగిలాయి. వ్యవహారం పోలీసు స్టేషన్‌కెక్కింది. నా ఉద్యోగ వివరాలు విన్న పెద్ద పొట్ట పోలీసాఫీసర్ "మీరెళ్లండంకుల్ మీ మీద కేసు పెట్టటమే" అని వినయం ఒలకపోసాడు. చేతిలో తుపాకున్నా వాణ్ణి కాల్చేద్దును. కనీసం బాంబున్నా విసిరేద్దును. నిరాయుధుడిని కాబట్టి నిస్సహాయంగా బయటకొచ్చాను. అర్థమవుతున్నదా డా. మనస్వీ?

ఊ... అంటూ మూల్గాడు మనస్వి.




"అసలు నా జాతక ప్రభావం అనుకుంటాను డాక్టారూ. ఎప్పుడైనా వూరెళ్లాలని పెద్ద బస్టాండుకెళ్లి ఖాళీ బెంచి వెతుక్కుని కూచుని హమ్మయ్య అనుకుంటానా.. అప్పటిదాకా కనుచూపు మేరలో కనపడని స్వీపరు అక్కడే భూమిలోంచి పుట్టుకొచ్చిందాన్లా ప్రత్యక్షమయ్యి "కాళ్లు పైకి పెట్టుకో అంకుల్ ఇక్కడ ఊడ్వాలి" అంటుంది. ఇంటికొచ్చి బాత్‌రూంలో మా ఆవిడ చూడకుండా ఎన్నిసార్లు ఏడ్చి వుంటానో ఊహించగలరా? అంకుల్ - కాదు..కాదు డాక్టర్. ఆవేశంతో పిడికిళ్లు బిగించి అడిగాను. డాక్టరు ఉలిక్కిపడి సర్దుకున్నాడు. తలుపు చాటు నుంచి గడప మీద పెట్టి మళ్లీ లోపలకి ఉపసంహరించుక్కున్న ఆడమనిషి తాలుకూ కాలు కనిపించింది.

ఇంకో రెండు సంఘటనలు చెబుతాను డాక్టర్. దానితో మీకు నా గురించి నా బాధ గురించి పూర్తిగా అర్థమవుతుంది. మా కాలనీకి ఒకావిడ కూరగాయలు తోపుడు బండి మీద తెచ్చి అమ్ముతుంది. ఏ మాటకామాటే ఆవిడ నా కళ్లకు ఆడ్రీ హెప్ బర్న్‌లా కనిపిస్తుంది. నా సౌందర్యాభిలాష బయటపడకుండా తగు జాగ్రత్తలు తీసుకొని మా ఆవిడకు నానా కారణాలు చెప్పి ఆడ్రీ హెప్ బర్న్ దగ్గర కూరలు కొనిపిస్తున్నాను. మా ఆవిడను చూసి పక్కింటి వాళ్లు ఆడ్రీ దగ్గరే కూరలు కొంటున్నారు. కూరలమ్ముతున్న ఆడ్రీని మా ముందు గది కిటికీ ఊచల సందుల్లోంచి చూసి అజ్ఞాతంగా ఆరాధిస్తున్నాను. ఒకనాడు గేటు దగ్గరున్న నన్ను-నా అందాల ఆడ్రీకి ఏం పుట్టిందో ఏమో- అంకుల్ అమ్మగారు లేరా అని అడిగింది. దీన్ని మూలిగే నక్క మీద తాటిపండు అనొచ్చు అనుకుంటాను డాక్టర్. కాళ్ల కింద నేల తొలగిపోవడం అని కూడా అనొచ్చు. ఆ క్షణానే ఆడ్రీ నా అభిమానం కోల్పోయింది.

మనస్వి కొంచెం చికాకుగా కుర్చీలో కదిలాడు. ఒక్కటే సంఘటన డాక్టర్ మా కాలనీ లేజీ పోరగాళ్లు క్రికెట్ ఆడుతుంటే బంతి నా కాళ్ల దగ్గరకొచ్చి ఆగింది. "జర్ర ఆ బాలియ్యరాదే అంకుల్" అన్నాడు. తనకు తానే హ్రుతిక్ రోషన్ అనుకునే పోరడు. నాకు మంటెత్తి వాడు, వాడి తండ్రి, తాత ముత్తాతలు అంకుళ్లు కావచ్చేమోగాని, నేను మాత్రం కాదని స్పష్టం చేసాను. "మీకు కోపం మస్తుగుంది అంకుల్ మీ కోపాన్ని బారేతు" అంటూ ఇంకా ఏదో అనబోతుంటే అక్కడి నుంచి వెళ్లిపోయాను డాక్టర్. నన్నెవరన్నా అంకుల్ అంటే నాకు అగ్గిపెట్టె పక్కల మీద గోళ్లతో గీసినట్లు సీనారేకుల మీద మేకులతో గీసినట్లుంటుంది. అంతా నన్ను పిచ్చివాడని ముద్రేశారు"

"అయితే మీరు రేపు రండి. మీరు నిజంగా పిచ్చివాళ్లా కాదా, చెపుతాను"

***

అదే రాత్రి నా భార్యతో నాకు, మర్నాడొచ్చే ఆదివారం నాడు ఆత్మహత్య చేసుకోవాలనుందని చెప్పాను. ఆవిడ కాసేపు ఆలోచించి వచ్చే నెల మూడో ఆదివారం చేసుకోండి బాబూ అప్పటికి టివి సీరియల్ "రామూ అంకుల్ రాధా ఆంటీ" అయిపోతుంది. ఖర్మగాలి రేపే మీరు చనిపోతే పదమూడు రోజులు చుట్టపక్కాలతో కిటకిటలాడే ఇంట్లో సీరియల్ చూడడం పడదు. నవ వితంతువు పక్కింటికి వెళ్లి సీరియల్ చూస్తే అంతా ఆక్షేపిస్తారంది. ఈసడింపుగా ఆవిడకేసి నిరసనగా చూసి బయటకి

వచ్చాను. ఆకాశంలో చందమామ-నక్షత్రాలు అందంగా కనిపిస్తున్నాయి ''రా రా అంకుల్ చంద మామ అంకుల్'' అంటూ పక్కింటావిడ తన పాపా యికి చందమామను చూపుతూ పాడుతోంది. లోకం యావత్తు పాడైపోయింది.

ఆ మర్నాడు ఉదయం నా బాల్య మిత్రుడు బల రాంని కలిసి డాక్టర్ సంగతి చెప్పాను. వైద్యం కంటే ముందు అర్జంటుగా ఆదివారం నాడు ఆత్మహత్య చేసుకుంటానని చెప్పాను. వాడు ఆశగా ''నీ సిడి లు-కేసెట్లు నాకు వీలునామా రాయరా'' అన్నాడు.

''అలాగే రాస్తాను కాని- వాటిని సెకండ్ హ్యాండ్‌లో అమ్ముకోనని మాటియ్యి''

''సరే ప్రమాణంరా! నేను ఎన్ని విపత్కర పరిస్థితు లొచ్చినా వాటిని అమ్ముకోను. అయినా నీ పిచ్చిగాని ఆ పాతపాటలెవడు కొంటాడ్రా. నీలాంటోడు తప్పా. ఒక్క మాటరా. నువ్వూ మీ ఆవిడ మాట మీద వచ్చే నెల మూడో ఆదివారం ఆత్మహత్య చేసుకోరా! నేను ఈలోపు ఎల్‌టిసి మీద వైజాగెళ్లి వచ్చేస్తాను.''

''సరేరా బలరాం! కానీ నా ఆఖరి కోరిక ఒకటి తీర్చాలిరా. మన కాలనీలో కవి కంగారుగారున్నారే. వారినోమారు కలిసి నా మీద విషాద గీతం రాయించి నా శవయాత్రలో లిక్వియంగా వాడాలి. విన్నవాళ్లకు కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాలి.''

''కవి కంగారుగారు పాట రాయకపోవచ్చురా! ఆయన అంతర్జాతీయ ప్రాముఖ్యం వున్న వాళ్లు చని పోతే పాట రాస్తారు తప్ప నీలాంటి జమ్మాయిజక్కా యికి రాయరు. నీలాంటి అనామతుల మరణానికి వారు స్పందించకపోవచ్చు''

''మరి ఈ వూరికి నేను ప్రముఖుడినే కదరా''

''అసలు సంగతి మర్చిపోయాను. ఈ మధ్య తంగూడియా దేశానికి చెందిన ప్రముఖుడు తపెస్కో మరణించాడని కంగారు గారితో ఎవరో అన్నారట. ' తప్పులు చేసే వాళ్ల కోసం బలయ్యావా...తపిస్కో ఏ తప్పూ చేయలేదని దేవుని ముందు ఒప్పేస్కో' అనే పల్లవితో దాదాపు గంట సేపు సాగే పాట రాసి నగర సంకీర్తనలా పాడుకుంటూ కాలనీ అంతా తిరిగాడు. దాంతో వారిద్దరి కొడుకులు వారి వెనకాలే వెళ్లి అక స్మాత్తుగా వారి ముఖం మీద దుప్పటి కప్పి పెడరె క్కలు వెనక్కి విరిచికట్టి ఇంటికి లాక్కెళ్లారు. అంతా మెరుపుదాడన్నమాట. రెప్పపాటులో జరిగిపో యింది. ఏ మాత్రం అలికిడి అయినా మనవాడు దొర కడుగా. ఇలా పట్టుకోవడాన్ని ఆపరేషన్ 'పాయిట్‌కే చ్' అంటారని వాళ్ల పెద్దబ్బాయి చెప్పాడు''

''తర్వాత''

''ఇంట్లో వాళ్లావిడ అట్లకాడ ఎర్రగా – అక్షరాలా- ఎర్రగా కాల్చి కంగారు గారి అరచేతిలో పెట్టిందట. కుర్రాళ్లిద్దరూ కంగారు గారి కుడి అరచేతిని బలంగా మూశారట. కంగారుగారు హైపిచ్‌లో ఆర్తనాదం చేస్తే కాలనీ అంతా వినిపించిందట. కాని ఎవరూ వెళ్లి సానుభూతి తెలపలేదట. పిచ్చి పాటల వాడికి సాను భూతి ఏమిటి మన బొంద అనుకున్నారట. మనిద్ద రమూ ఊర్లో లేనప్పుడు ఈ ఘాతుకం జరిగిందట. పాపం కుడి అరచేయి కాలిన తరువాత వారు పాటలేం రాస్తారురా''

''పోనీ ఆశువుగా పాడమను రికార్డు చేసు కుందాం''

''అసలే వీలుపడదురా. అతనాపని నిరంతరంగా నిరాఘాటంగా చేస్తున్నాడని ఆయన పిల్లలు ఆయన నోట్లో గుడ్డలు కుక్కుతున్నారట. ఈ విషయం ఇరుగు పొరుగూ బాహటంగా చెప్పుకుంటున్నారు''

''ఇంతకూ ఈ తంగూడియా దేశం ఎక్కడుంది రా?''

''అమ్మతోడు నాకూ తెలియదురా. మొన్న ఆటవి డుపుగా ఆయన నోట్లో గుడ్డలు కాసేపు తీశారని తెలిసి వెళ్లి అడిగాను. అరిచేయి కాలిచస్తున్నాన్న ధ్యాస లేకుండా నిన్న కాక మొన్న మనం మధ్యధరా సంద్రంలో నేడు కాక రేపు మనం అమెజాన్ తీరంలో అంటూ పాట లంకించుకున్నాడు. పాట ప్రమాదం పసికట్టిన వాళ్లబ్బాయిలు గుడ్డలతో శరవేగంగా వస్తుంటే ఆపి నేను కేవలం భౌగోళిక విజ్ఞాన తృష్ణతో వచ్చానని పాటలు విని ఆనందించడానికి కాదని నచ్చజెప్పి కంగారు గారిని తంగూడియా ఎక్క డుందో త్వరగా చెప్పమంటే తనకూ తెలియదన్నాడు. తపిస్కో ఎలా తెలుసునంటే తెలుసునని ఎవడన్నా డని ఎదురు ప్రశ్న వేశాడు. దాంతో ఒళ్లు మండి వారి నోట్లో గుడ్డల వుండ కుక్కించి వచ్చాను''

సరేలే పాటలంటే ప్రజాస్వామ్యయుతంగా చెప్పొ చ్చుకాని ఇలా హింసాత్మకంగా కవి గాయకుల గొంతు మూగ పోగొట్టడం ఏమాత్రం వాంఛనీయం కాదని చెప్పాను.

''ఒరేయి బలరాం నా శవయాత్ర మీ ఇష్టం వచ్చి నప్పుడు చేయించండి. కాని కనీసం రుడాలిలో హజా లికా పాట లిక్వియంగా పెట్టించండి'' అలా ఆ సమావేశం ముగించి డా. మనస్వి దగ్గరకు వెళ్లాను.

***

తలుపు చాటున ఒక ఆడశాల్తీ వుందని నా మైండ్లో గంటలు మోగు తున్నాయి.

''మనస్విగారూ! ఆడమనిషినైనా బాగుండునని నిన్న మీరు విలపించినట్లు గుర్తు. ఎంచేత?''

''మా ఆవిడనడ గండి'' కన్నీళ్లు పెట్టుకు న్నాడు.

ఓహో తనెందుకు ఆడనయినా కాకపోతి నని తన ఆడమనిషిని అడగమంటే అది ఆ సంబంధిత స్త్రీ పురుషుల సమస్య కాని నాలాంటి మూడో వ్యక్తి తెలుసుకో కూడదని సభ్యతగల పెద్ద మనిషిగా భావించాను.

''డాక్టరు గారూ నిన్న నా సంగతి తమకు విశదం చేసాను. అంకుల్ అని పిలిచినా నాకు కోపం రాకుండా శాంతంగా వుండేటట్లు మందేదైనా ఇవ్వండి. హిప్నటైజ్ చేయండి, కానీ అంకుల్....''

అంతే నా కళ్ల ముందు వెయ్యి మెరుపులు మెరి సాయి. నా నెత్తి మీద కర్ర దెబ్బలు పడుతున్నట్లు నా మెదడు సంకేతాలు పంపుతున్నది. ఇట్లాగే వుంటే దెబ్బలతో చచ్చి ఆత్మహత్య అవకాశం పోగొట్టు కుంటానేమోనని భయం వేసింది. దాంతో బరువుగా కళ్లెత్తి చూస్తే రెండు ఆడకాళ్లు అంటే ఆడ మనిషి కాళ్లు కనిపించాయి. నన్ను కొడుతున్నవి ఆ కాళ్ల తాలుకూ మనిషేనని నా జ్ఞానేంద్రియాల ద్వారా గ్రహించాను. కాళ్లు పట్టుకొని కొట్టడం ఆపమని ప్రార్థిద్దామని చేతులు ముందుకు చాపాను. రెప్పపాటులో నా రెండు మణికట్ల మీద రెండు కర్ర దెబ్బలు పడ్డాయి.

''హంసా నందీ: ఆగు.... ఆగు... కొట్టమాకు. ఆయన నన్నేమనలేదు'' అని మనస్వి గొంతు విని పించింది. మరుక్షణంలో ఇద్దరూ కలిసి నన్ను కుర్చీలో పడేశారు.

''హంసానందీ, ఆయన నన్ను డాక్టర్ అనే సంబో ధిస్తున్నాడు. తనని అంకుల్ అనే వాళ్ల సంగతి ఏదో చెప్పబోతుంటే నువ్వే కర్రతో అతని మీద గెరిల్లా దాడికి పాల్పడ్డావు''

హంసానంది తన కన్నీళ్లతో నా తలతడిపింది. క్షమించమంది. తను నాపై చేసిన దాడికి సంజాయిషీ ఇచ్చుకుంది. డాక్టరు మనస్వి గారి దగ్గరకి ఆఖరి పేషెంటు ఆర్నెల్ల కిందట వచ్చాడట. తరువాత రావడం నేనేనట. ప్రతి రోగి డాక్టర్ గారిని అంకుల్ అని సంబోధిస్తుంటే ఆయనకు పిచ్చిపట్టినట్లయి ప్రాక్టీసు దాదాపు మానుకున్నాడట. ఈ లోపు నేను


కాకమ్మ కబుర్లకు కడుదూరం!
విలువలున్న వివాహాల చరిత్ర కాకతీయ సొంతం

ఆకుపచ్చని తోరణం... పసుపు పచ్చని గడప... 'కాకతీయ' తెచ్చిన పెళ్ళి మండపం... 3 దశాబ్దాలుగా... 4 రాష్ట్రాల్లో.... 30 నగరాలలో.... చక్కని పెళ్లికి.... చిరకాల అనుబంధానికి... కాకతీయ మ్యారేజెస్ ప్రైవేట్ లిమిటెడ్. నేడే మీ సమీప బ్రాంచ్‌ను సందర్శించండి. మీ కలల భాగస్వామిని కలుసుకోండి.



శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచిలి

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-2374 7777, 09396 999 999

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION

www.kaakateeya.com www.telugumarriages.com www.kannadamarriages.com www.tamilmarriages.com

www.kaakateeya.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | తాంబరం | 093400 99993 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | బెంగుళూరు | 093429 39345 |
| విజయవాడ | 093922 92939 | జయానగర్ | 093429 39343 |
| గుంటూరు | 098485 35375 | మైసూరు | 093429 39342 |
| తెనాలి | 098480 31931 | కోయంబత్తూరు | 093457 94668 |
| విశాఖపట్నం | 098481 63833 | సేలం | 093855 99066 |
| రాజమండ్రి | 098485 35377 | మధురై | 093603 35233 |
| కాకినాడ | 098483 37378 | వెల్లూర్ | 093449 94400 |
| ఖమ్మం | 093470 59988 | తిరుచి | 098428 01111 |
| ఒంగోలు | 098487 11223 | పాండిచ్చేరి | 098421 27777 |
| నెల్లూరు | 098481 97222 | ఈరోడ్ | 093855 99011 |
| తిరుపతి | 098485 35378 | అనంతపూర్ | 093460 09348 |
| కర్నూల్ | 093900 33815 | | |



## కథకే ఇంపార్టెన్స్

సినిమాకి కథే ప్రాణమంటాడు జాహెద్‌ఖాన్. 'మై హూనా' సినిమాతో వెలుగులోకొచ్చిన ఈ కుర్రహీరో ఇప్పుడు బోలెడు సినిమాల్లో నటిస్తున్నాడు. కథనచ్చితే తప్ప పాత్రని ఓకే చేయనంటున్నాడు. 'నేనెవరి దగ్గరికీ వెళ్లి వేషాలడగను. పబ్లిక్ రిలేషన్స్ నాకు బొత్తిగా తెలియవు. అవతలి వాళ్ళ అహాన్ని సంతృప్తి పరచి ప్రయోజనాలు పొందడం నాకు చేతకాదు'' అంటాడు. అన్నట్టు చెప్పడం మరిచా ఈ కుర్రాడు సంజయ్‌ఖాన్ కొడుకు. మరి సంజయ్‌ఖాన్ కొడుక్కి వేషాలడుక్కునే ఖర్మేంటి?

వచ్చి అతను అంకుల్ కాదు డాక్టర్ అని గుర్తు చేసినందుకు ఆ దంపతులకు మళ్ళీ జన్మనెత్తినంత ఆనందంగా వుందట. అంకుల్ అనే వాళ్ల మీద కక్ష కట్టిన హంసానంది తన భర్తను ఎవరైనా అంకుల్ అని పిలిస్తే తల పగలగొట్టడానికి కట్టె పట్టుకొని తలుపు చాటునే వుంటుందట. నా సంభాషణ తప్పుగా అర్థం చేసుకొని నా మీద దొంగ దాడి చేసినందుకు మన్నించమని ప్రార్థిస్తూ కాఫీ తెచ్చింది. మణికట్లు నొప్పులుగా వున్నాయంటే తనే తాగించింది.

మనస్వి అందుకున్నాడు. ''అందుకే నేను ఆడమనిషిగా పుట్టినా సరిపోయేది అన్నది. అప్పుడు మన్ని ఎవరూ అంకుల్ అని పిలవరుగా'' మురిపెంగా అన్నాడు.

''ఆంటీ అంటారుగా'' అంతే మురిపెంగా అన్నాను.

ఏది ఏమైనా డాక్టరు మనస్వి కూడా చాలా బాధపడుతున్నట్లు అర్థమయింది. తనకూ పిచ్చి పట్టిందా? పట్టబోతున్నదా? ఇంకా బోధపడలేదట. తను కూడా ఆత్మహత్యా నిర్ణయం తీసుకున్నాడట. అయితే అతనంటే ప్రాణం పెట్టే హంసానంది కట్టె పుచ్చుకొని అతడాపని చేయకుండా అహర్నిశలు కాపలా కాస్తున్నదట. అలాగే అతన్ని అంకుల్ అని పిలిచే శత్రువులను శిక్షించడమే తన ధ్యేయంగా పెట్టుకుందట మనస్వి అన్నాడు. ''మనం ఇద్దరం ఒకే బోటులో పయనిస్తున్నాం''

''మరి తెడ్డు వేసే అంకుల్ లేడుగా.. . నేను తెడ్డు వేస్తానంకుల్'' అంటూ బలరాంగాడు ఎవరో పిలిచినట్లుగా దైవోపహతుడిలా లోపలకి వచ్చాడు. జెమాజెట్టి లాంటి బలరాం హంసానంది వ్యూహాత్మక దాడిని పసిగట్టలేక క్షతగాత్రుడై మరో కుర్చీలో కూలబడ్డాడు. హంసానంది బలరాంను క్షమాపణ కోరనని వాడి దగ్గరగా వచ్చి వాడి ముక్కు మీద ఒక్క గుద్దు గుద్ది చెప్పింది. చేసేదేం లేక బలరాం విలవిలలాడాడు. మేం కాస్త తేరుకున్న తరువాత హంసానంది డాక్టరుగారూ, రావు గారూ ఒకే పరిస్థితిలో వున్నారంది

''అంకుల్ అని ఎవరు పిలిచినా సహించలేకపోతున్నారు. కాబట్టి వీళ్లిద్దరూ రోగులే. ఏమంటారు బలరాం!''

''మీ చేతిలో కట్టె పక్కన పెట్టందే నేను ఒక్క మాట కూడా మాట్లాడను'' బలరాం నీళ్లు నమలకుండా ఖచ్చితంగా చెప్పాడు. ఏతావాతా నేనూ, డాక్టర్ మనస్వి ఒకేరకంగా బాధపడుతున్నాము కాబట్టి మేమిద్దరం కల్సి హైదరాబాదులో మరో డాక్టరును సంప్రదించాలని నిశ్చయించుకొని మర్నాడే హైదరాబాద్ చేరాం.

***

డాక్టర్ సత్యాగ్రహి పేరు మోసిన సైకియాట్రిస్టు. ఆ మర్నాడు వారి అపాయింట్‌మెంటు తీసుకున్నాం. మర్నాడు సాయంత్రం రమ్మన్నాడు. మర్నాడు సాయంత్రం దాకా అనేకమంది చేత అంకుల్ అని పిలిపించుకున్నాం. మనస్వి హఠాత్తుగా ''రావు గారూ నాకో సత్యం బోధపడిందండి'' అన్నాడు.

''సెలవివ్వండి'' అన్నాను.

''మనూరు జనాభా తక్కువ కదా అందుకే అంకుల్ అని పిలిచే వారి సంఖ్య తక్కువ. హైదరాబాద్ జనాభా ఎక్కువ కదా ఆ నిష్పత్తిలో మనల్ని అంకుల్ అని పిలిచే వాళ్ల సంఖ్యా ఎక్కువే. ఒక వేళ ఢిల్లీ వెడతామనుకోండి. ఆ సంఖ్య మరీ ఎక్కువ అవుతుంది. ఎలా వుంది మన తెలివి'' మురుసుకుంటూ అడిగాడు.

''అబ్బా! అర్కిమెడిస్‌లాగా ఒక గొప్ప సత్యమే కనిపెట్టారే'' అన్నాను.

ఆ సాయంత్రం సత్యాగ్రహిగారి దగ్గరకు వెళ్లాము. ఆయన మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి ఒకరి తరువాత ఒకరుగా కన్‌సల్టింగురూమ్‌లోకి రమ్మన్నాడు. మా ఇద్దరి సమస్యా ఒక్కటే అంటూ ఇద్దరం ఒకేసారి లోపలకి వెళ్లాం. రుద్ధకంఠంతో మేమిద్దరం మా బాధ వెళ్లబోసుకున్నాం.

సత్యాగ్రహి గొంతు సవరించుకొన్నారు. ''చూడండి కాలాన్ని బట్టి మనిషి నడవాలి గాని మనిషిని బట్టి కాలం నడవదు కదా! అందరూ అందరిని ఆంకుల్, ఆంటీలనే పిలుస్తున్నారు. వాళ్ళెవరూ చెందని ఆవేదన మీకిద్దరికెందుకు, నా ప్రశ్నకు జవాబు చెప్పండి''

మేము మా సమస్య పరిష్కారానికి బదులు ఒక గొప్ప మాటల మాయాజాలంలో చిక్కుకోబోతున్నామని గ్రహించాము. మేం వచ్చింది. వ్యక్తిత్వ వికాసానిక్కాదని, రోగ లక్షణాలు చెప్పి మందో మాకో తీసుకుందామని వచ్చాము అని స్పష్టం చేశాము.

సత్యాగ్రహి అందుకున్నాడు. ''అన్నా, అక్కా పిలుపులు మాయమయ్యాయి. వాటి స్థానంలో అంకుల్, ఆంటీ పిలుపులొచ్చాయి. సర్దుకుపోవాలి. మాకొచ్చే కొన్ని ప్రశ్నలు ఎలా వుంటాయో తెలుసా? అంకుల్ నాకు ఒక ఆంటీతో శారీరక కలయిక అనుకోకుండా జరిగింది. ఇది ఆంటీ ప్రోత్సాహంతోనే జరిగింది. దీనివల్ల నాకేమయినా ప్రమాదం వుందా? ఎయిడ్స్ లాంటి రోగాలు ఏమన్నా వస్తాయా?''

''సరిగ్గా అలాంటి ప్రశ్నలు చదివే నాకు అసహ్యం వేసింది. ఆంటీలంతా చెడ్డవాళ్లని, ఈ ప్రశ్నలడిగేవాళ్లు నిత్య యవ్వనులని, కేసనోవాలుగా భావించుకొని ఆ ఆంటీల భర్తలు అంటే అంకుళ్లు చేతకాని వారని ప్రశ్నలు ఆకతాయిలు కామెంట్స్ విని మాకు ఆ పిలుపంటే కోపమొస్తున్నట్లుంది'' అన్నాడు మనస్వి.

''అవును అలాంటి భావన మీ అంతచ్చేతనలో కదలాడుతోంది. కాబట్టే మీకు అలా మండుకొస్తున్నది. అది అలా వుంచితే మీరు సెన్సిటివ్స్. మీరు పెరిగిన కుటుంబ వాతావరణం మిమ్మల్ని డీక్లాసు చేసుకోకుండా అడ్డుపడి నలుగురితో కలువకుండా చేస్తున్నది. మీరు అన్యథా భావించకపోతే అంకుల్ అని పిలిపించుకున్నంతలో మనకు పోయేదేం లేదు. మీకు సమస్యే కాదు. నలుగురితో కలివిడిగా తిరగండి. మీరు మిగతా వాళ్లకంటే గొప్ప వాళ్లమని భావించకండి. అన్నీ సర్దుకుంటాయి.''

సరేనని తలూపి లేచాం. సత్యాగ్రహి పెద్దకొడుకు కాబోలు వచ్చి అంకుల్ అసలు ఈ ప్రపంచమే అంకుల్ శామ్ ఆజ్ఞానుసారం నడుస్తోంది. అందరికీ అందరూ అంకుళ్లే. అంతా మామ మయం అన్నాడు.

కాబోలునను కుని బయటకి వచ్చాం. అంతా రామమయం పాట అంతా మామ మయంలా వినపడుతోంది. చెవులు కూడా డాక్టరుకు చూపించుకోవాలి కాబోలు ఖర్మ.